క్లుప్తంగా

1న లక్ష పసుపు కొమ్ములతో అర్చన

మాకవరపాలెం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక దుర్గామల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు మల్లికార్జునశర్మ ఆదివారం తెలిపారు. వచ్చే నెల 1న ఆలయంలో ఉదయం నుంచి అష్టోత్తర శత కలశ అభిషేకం, లక్ష పసుపు కొమ్ముల అర్చన, సహస్ర పుష్పార్చన, కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. 2వ తేదీన మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు భారీగా పూజల్లో పాల్గొనాలని కోరారు.

నేడు సీతారాములువారి తీర్థం

మాడుగుల: ఓడపాడులో మంగళవారం సీతారాములువారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లు బళ్ల పరుగు పందెం , ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ తీర్థం రేపు

రావికమతం: కొత్తకోటలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ తీర్థం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆ రోజు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందెం, రంగవల్లుల పోటీలు ఉంటాయన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి శివాలయ ప్రారంభోత్సవాలు



నీలకంఠేశ్వరస్వామి ఆలయం

బుచ్చెయ్యపేట: నీలకంఠాపురంలో సోమవారం నుంచి శివాలయం ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఇక్కడ నూతనంగా శివాలయం నిర్మించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తారు. బుధవారం శివలింగం ప్రతిష్ట చేయనున్నారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బి.వి. సత్యవతి, మండల నాయకులు పాల్గొంటారు. ఆయా గ్రామాల నాయకులు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సర్పంచ్ పడాల నాగభూషణం కోరారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూల అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రసాదం పంచిపెట్టింది. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి రావడంతో రద్దీ నెలకొంది.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేసిన సర్పంచ్ తదితర్లు

రావికమతం: గుమ్మాళ్లపాడులోని అప్పలరాజు చెరువు నుంచి అయ్యచెరువు వరకూ గెడ్డకు ఇరువైపులా మట్టి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీ బంటు విజయలక్ష్మి శ్రీను ఆదివారం భూమిపూజ చేశారు. 20 కుటుంబాల రైతులకు ఈ రహదారి ఉపయోగకరమని ఎప్పటి నుంచో కోరుతున్నా గత పాలకులు హామీలకే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ కాళింగ శివయ్యనాయుడు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మాది

గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



చెట్టుపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మాది, అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చెట్టుపల్లి పంచాయతీలో 261 కుటుంబాలను ఆదివారం ఆయన కలిశారు. సంక్షేమ పథకాల అందుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాలువలు, సీసీరోడ్డు నిర్మాణాలకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. గ్రామంలోని 791 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా మూడేళ్లలో రూ 2,17,65,776 కోట్లు నేరుగా లబ్ధి కలిగిందన్నారు. ఇక్కడ ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణం, ఈ కాలనీతోపాటు పరదేశమ్మ గుడి వద్ద తాగునీటి బోర్లు ఏర్పాటు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ. 5 లక్షలు, మరో రూ.5 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి కేటాయిస్తామన్నారు.

రూ 2.50 కోట్లతో రెండు తారురోడ్లు

చుక్కపల్లి-చెట్టుపల్లి చెరకు కాటా నుంచి చెట్టుపల్లి మీదుగా వరహాపురం-పెదగోగాడ రోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ 1.60 కోట్లు, అర్జునగిరి-చెట్టుపల్లి మధ్యలో తారురోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షలు కేటాయించామని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం ఆ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో మాస్టర్ ట్రైనర్‌గా రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన గ్రామానికి చెందిన నాగమణిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాతాళం చిన్నంనాయుడు, చుక్కపల్లి సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ, ఎంపీటీసీ సుంకర వెంకటలక్ష్మి, పాతాళం శ్రీను, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, బాయిశెట్టి వెంకటరమణ, ధర్మిశెట్టి స్వాతికొండబాబు, యర్రా అప్పారావు, తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్ పాల్గొన్నారు.

నేడు బి. కింతాడ కొత్తూరులో..

దేవరాపల్లి: బోయిలకింతాడ గ్రామ సచివాలయం పరిధిలోని బోయిలకింతాడ కొత్తూరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొంటారని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ శనివారం తీర్థ మహోత్సవం నిర్వహించి ఆదివారం రాత్రి గౌరీపమేశ్వరులను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఉదయం నుంచి భక్తులు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాలైన దాలింపేట, మాకవరపాలెం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి తీర్థ మహోత్సవాన్ని తిలకించారు. సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, మాజీ సర్పంచ్ చిటికెల రమణ, గ్రామ పెద్ద రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత రైతు కుటుంబాన్ని ఓదార్చుతున్న జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: సింగన్నదొరపాలెంలో శుక్రవారం అర్ధ రాత్రి అగ్ని ప్రమాదంలో పశువుల పాకతోపాటు గేదె, గడ్డి, ధాన్యం కోల్పోయిన రొంగలి అక్కునాయుడు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవనున్నట్లు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తెలిపారు. ఆదివారం ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచన మేరకు రూ.5 వేలు అందించారు. పశువులను మరలా పెంచుకుంటే కావాల్సిన గడ్డిని సమకూర్చనున్నట్లు భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రొంగలి వెంకటరమణ, లాలం నాని, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, మాజీ ఎంపీపీ నారపాటి సత్యవతి, శ్రీరామ్మూర్తి, కర్రి నాయుడు పాల్గొన్నారు.

ఎం. కోడూరు పీఏసీఎస్ సీఈవోగా రామునాయుడు



రామునాయుడిని అభినందిస్తున్న పర్సన్ ఇన్‌చార్జి రాజేశ్ తదితర్లు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు పీఏసీఎస్ సీఈవోగా బంటు రామునాయుడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని సంఘం పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేశ్ ఆదివారం తెలిపారు. రామునాయుడు గతంలో కింతలి పీఏసీఎస్‌లో సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ, పదోన్నతిపై ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారన్నారు. అతడిని పర్సన్ ఇన్‌చార్జితో పాటు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, మాజీ పర్సన్ ఇన్‌చార్జి పడాల అప్పలనాయుడు, తదితర్లు అభినందించారు. ఇక్కడ సీఈవో పి. గణేశ్‌ను కింతలి పీఏసీఎస్‌కు బదిలీ చేశారు.

ముగిసిన ఉచిత శిక్షణ తరగతులు



శిక్షణ ఇస్తున్న రామారావు

రావికమతం: టి.అర్జాపురం క్లస్టర్ పాఠశాల విద్యార్థులకు సీఆర్పీ గుంటూరు రామారావు 40 రోజులుగా ఇస్తున్న ఉచిత శిక్షణ ఆదివారంతో ముగిసింది. క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఏటా ఎన్ఎంఎంఎస్‌తోపాటు పలు కాంపిటీషన్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తుంటాడు. ఈ ఏడాది 40 మందికి కోచింగ్ ఇవ్వగా, ఆదివారం నిర్వహించిన ఫైనల్ టెస్ట్‌తో శిక్షణ ముగిసింది.

ఎన్ఎంఎంఎస్ మాక్ టెస్టుకు స్పందన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సంస్థ, స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు (అనకాపల్లి) సహకారంతో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) మాక్ గ్రాండ్ టెస్టు ఆదివారం వి.వి.అగ్రహారంలో నిర్వహించారు. ఈ టెస్టుకు నాలుగు మండలాల నుంచి 380 మంది విద్యార్థులు హాజరయ్యారు. కె.జె.పురం హైస్కూలుకు చెందిన పి. జయశ్రీ, వీరనారాయణం హైస్కూలుకు చెందిన వై. యశ్వంత్, వడ్డాది హైస్కూలుకు చెందిన నోము శ్రీ సత్య, కింతలి హైస్కూలుకు చెందిన ఎం. రమ్య, కె.జె.పురం హైస్కూలుకు చెందిన ఎ. ఉషశ్రీతో పాటు మరో ఐదుగురికి కలిపి మొత్తం పది మందికి సృజనవాణి పాలకవర్గ సభ్యుడు సురేష్ ఉత్తమ బహుమతులు ప్రదానం చేశారు. సృజనవాణి స్వచ్ఛంద సంస్థ సభ్యులు జానీ, రామారావు, ఝాన్సీ, లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుది దశకు దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ పనులు

పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పనులను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులు ఆఖరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ పనులను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ఇప్పటికే కాంప్లెక్స్ ఆవరణను సిమెంట్ కాంక్రీట్‌తో ప్లాట్‌ఫాం మాదిరిగా నిర్మించారు. కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం సామాజిక మరుగుదొడ్లు నిర్మాణానికి సైతం రూ. 6 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆయన ఆదేశించారు. తాజాగా సీఎంఆర్ షాపింగ్ మాల్స్ సంస్థల అధినేత మావూరి వెంకటరావు సహకారంతో ఆర్టీసీ కాంప్లెక్స్ భవనానికి మెరుగులు దిద్దుతున్నారు. ఈ పనుల పురోగతిని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర రావు డిప్యూటీ సీఎంకు వివరించారు. పనులను వీలైనంతా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాలేటి నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, వెంకటరావు

కె.కోటపాడు: మేడిచర్లలో అభయాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, కుంకుమ పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు, అభివృద్ధి కమిటీ చైర్మన్ కిల్లి జగన్నాథం, బొడ్డు వేణు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య పంచాయతీగా బి. కింతాడ

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు



బోయిలకింతాడలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: బోయిలకింతాడను సంపూర్ణ పారిశుధ్య పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు. బోయిలకింతాడలో పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక పారిశుధ్య పనులను ఆదివారం చేపట్టారు. గ్రామంలో చెత్తా చెదారాలను తొలగించడంతోపాటు డ్రైనేజీల్లో పూడిక తీత పనులను, రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కల తొలగింపు పనులను చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావుతో కలిసి ఈ పనులను బాబూరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్‌లకు అందజేయాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఉప సర్పంచ్ కోన శ్రీను, వార్డు మెంబర్ బొబ్బిలి రాము, వలంటీర్లు పాల్గొన్నారు.

శివాలయ ధ్వజస్తంభం ప్రతిష్ట పూజ ప్రారంభం



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ విజయశ్రీకాంత్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సత్తిబాబు

చోడవరం: ప్రాచీన దేవాలయమైన స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునః ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వ తేదీన ధ్వజస్తంభం పునః ప్రతిష్ట చేయనుండటంతో ముందుగా యాగశాలకు అంకురార్పణ చేశారు. విఘ్నేశ్వర స్వామి పూజ, పుణ్యావాహచనం, పంచ గవ్యప్రాసన దీక్షవస్త్రధారణ, రక్షా బంధనం యాగశాల ప్రవేశానికి అంకురార్పణ పూజలతో ధ్వజస్తంభం ప్రతిష్ట పూజలు ప్రారంభించారు. జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబు ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితుల బృందం ఈ పూజ క్రతువు నిర్వహించింది.

నర్సింహమూర్తికి డిప్యూటీ సీఎం నివాళి



నర్సింహమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక రాజరాజేశ్వరి కేబుల్ టీవీ అధినేత ఈర్నె నర్సింహమూర్తి చిత్రపటానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఘన నివాళులర్పించారు. ఆదివారం దేవరాపల్లిలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. నర్సింహమూర్తి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. వ్యాపారవేత్తగా స్థానికంగా గుర్తింపు పొందిన వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వాలేటి నాగరాజు పాల్గొన్నారు.

చినపాచిలలో తాగునీటి సమస్య



మోటారు పాడవ్వడంతో పనిచేయని ప్రధాన పైపులైన్

రావికమతం: చినపాచిలలో 12 రోజులుగా మంచినీటి సమస్య నెలకొంది. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన మంచినీటి ట్యాంకుకు అమర్చిన మోటారు, ఎలక్ట్రికల్ బోర్డు పాడవ్వడంతో ఈ సమస్య తలెత్తింది. వెంటనే వీటిని బాగుచేయాలని కోరినా ఇప్పటికీ గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉప సర్పంచ్ కోమటి శంకర్రావు ఆదివారం ఆరోపించారు. గ్రామంలో మంచినీటి ట్యాంకులు అలంకార ప్రాయంగా ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు నవజాత శిశు సంరక్షణ విభాగం ప్రారంభం

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో రూ.92 లక్షల వ్యయంతో నిర్మించిన నవజాతశిశు సంరక్షణ విభాగాన్ని సోమవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



పల్లపు ఆనందపురం ఎంపీటీసీ నానిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక : మునగపాక ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్లో 2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వాడ్రాపల్లి ఆవ వద్ద ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ సందడి చేశారు. విద్యాభ్యాసం నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పల్లపు ఆనందపురం ఎంపీటీసీ కర్రి నానిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంతోషి, సూరిశెట్టి రాము, బొడ్డేడ సంతోష్, జయ సంతోషి, లీల,శివ గణేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గుర్రపు పందేలు



దౌడు తీస్తున్న గుర్రం

మాడుగుల: కింతలి వల్లాపురంలో ఆదివారం ఆరేళ్లమ్మ తీర్థం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రపు పరుగు పందేలు ఆకర్షణగా నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, రాంబాబు, ఎంపీటీసీ బగుడు వరహాలమ్మ, కోఆపరేటివ్ అధ్యక్షుడు తాళ్లపురెడ్డి సోమన్నదొర, సూరిబాబు, శ్రీధర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వృథాగా ఏలేరు నీరు!

లాక్ సిస్టమ్ దెబ్బ తినడంతో దుస్థితి



కాలువకు 59వ కిలో మీటరు వద్ద ఏర్పాటు చేసిన పాయింట్



పైపులైను నీరు తరలించేందుకు ఏర్పాటు చేసిన లాక్‌సిస్టమ్



చినగొలుగొండపేట వద్ద వృథాగా పోతున్న ఏలేరు నీరు

నాతవరం: కళ్ల ముందే ఏలేరు కాలువ నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నం కాలువ ద్వారా 154 కిలోమీటర్ల మేర పోడవున నీరు ప్రవహిస్తోంది. మార్గం మధ్యలో పలు చోట్ల లీకేజీ ద్వారా నీరు నిత్యం వృథాగా పోతోంది. తూర్పుగోదావరి జిల్లాలో పలు గ్రామాలకు వేసవిలో తాగునీరు అందించేందుకు ఏలేరు కాలువకు 59వ కిలోమీటరు చినగొలుగొండపేట వద్ద పాయింట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ్నుంచి పైపులైన్ ద్వారా తుని నియోజకవర్గానికి తాగునీటిని తరలిస్తుంటారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో ప్రస్తుతం పైపులైన్ నుంచి తాగునీరు తరలించలేదు. ఈ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన లాక్ సిస్టమ్ దెబ్బతినడంతో ఏలేరు నీరంతా వృథాగా పోతోంది. కొండ ధర్మవరం, గునుపూడి, లింగంపేట, మన్యపురట్ల ఎ.పి.పురం, ఎ.శరభవరం గ్రామాల వద్ద ఈ పరిస్థితి ఉంది. ఈ లీకేజీ ద్వారా వచ్చే నీరు చినగొలుగొండపేట డ్రైనేజీలో నిత్యం కలుస్తోంది. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏలేరు కాలువ ద్వారా నీటిని విశాఖపట్నం జీవీఎంసీ స్టీల్‌ప్లాంటుకు గంగవరం పోర్టుకు ఎన్టీపీసీ, ఏపీఐఐసీకి ఇతర అవసరాలకు తరలిస్తున్నారు. రాజుపేట అగ్రహారం వద్ద తాండవ నదిపై నిర్మించిన ఆక్వా డెక్టు పి.కె.గూడెం సమీపంలో ఏలేరు కాలువపై నిర్మించిన స్లూయిజ్ ద్వారా లీకేజీ ద్వారా నీరు వృథాగా పోతోంది. ఈ విషయంపై ఏలేరు కాలువ జేఈ నానాజీ మాట్లాడుతూ పలు చోట్ల శిథిలమైన ఏలేరు కాలువ మరమ్మతులు చేసేందుకు నిధులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు వచ్చాక పనులు చేస్తామన్నారు.

చిల్డ్రన్ క్లబ్‌తో పఠనాసక్తి పెంపు



చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారిణి దమయంతి

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. క్లబ్‌లో పిల్లలను సభ్యులుగా చేర్పించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే గ్రంథాలయంపై ఆసక్తి పెంచేందుకు కొన్నాళ్లుగా చిల్డ్రన్‌క్లబ్ నిర్వహిస్తున్నామన్నారు. రాను రాను వచ్చే పిల్లల సంఖ్య పెరుగుతుందన్నారు. పిల్లల్లో పోటీతత్వం పెచ్చుతున్నామన్నారు. వారిలో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు విధిగా ప్రతి ఆదివారం చిల్డ్రన్ క్లబ్‌కు పంపించాలని కోరారు.